క్లుప్తంగా

శివాలయంలో నేడు విగ్రహ ప్రతిష్ఠ

గోకవరం: మల్లవరం గ్రామంలో ఉమామల్లేశ్వరస్వామి (శివాలయం) ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు తెలిపారు. ఉదయం ప్రత్యేక పూజలు, హోమాలు అనంతరం ఉమా మల్లేశ్వరస్వామి, గణపతి, నందీశ్వరుడు, నవగ్రహాలు, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి విగ్రహాలు, ధ్వజస్తంభం ప్రతిష్ఠ జరుగుతాయన్నారు.

అడుగంటిన చెరువులు



ఒమ్మంగిలో ఎండ తీవ్రతకు అడుగంటిన రాజ్ చెరువు

ప్రత్తిపాడు రూరల్: వేసవి ప్రారంభం నుంచే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతూ వచ్చాయి. ప్రస్తుతం ఎండలు తీవ్ర రూపం దాల్చాయి. ఫలితంగా ఒమ్మంగిలోని రాజ్ చెరువు, గోపాలుడు చెరువు, చింతలూరు రామానుజం చెరువు, పెద్దచెరువులతోపాటు పలు ఊర చెరువులు అడుగంటాయి. చెరువులు అడుగంటడంతో పశువులకు తాగునీరు అందని పరిస్థితి నెలకొంది. ఎండ తీవ్రతకు ప్రజల తాగునీటికి అల్లాడుతున్నారు. ప్రస్తుతం కొన్ని చెరువుల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి.

సత్యదేవుని దర్శించిన హైకోర్టు న్యాయమూర్తి



వేదపండితుల ఆశీస్సులు పొందుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజశేఖరరావు

అన్నవరం: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.రాజశేఖరరావు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం రాజశేఖరరావు కుటుంబ సభ్యులకు వేదపండితులు గొల్లపల్లి ఘనపాఠీ, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు వేదాశీస్సులు అందజేశారు. స్వామివారి ప్రసాదాలను ఆలయ ఏఈఓ డీవీఎస్ కృష్ణారావు అందించారు. రాజశేఖరరావు వెంట పలువురు న్యాయాధికారులు, ప్రత్తిపాడు సీఐ కిషోర్‌బాబు, శంఖవరం ఆర్ఐ ప్రసాద్ ఉన్నారు.

అన్నసమారాధన

గండేపల్లి: బొర్రంపాలెం గ్రామ దేవత దారలమ్మ తల్లి ఆలయం వద్ద ఆదివారం అన్న సమారాధన నిర్వహించారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న అమ్మవారి ఆలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు.

తాగునీటి సమస్య పరిష్కారం

శంఖవరం: గత కొంత కాలంగా స్థానిక బుర్రవారి వీధిలో ఉన్న తాగునీటి సమస్యను ఎట్టకేలకు అధికారులు పరిష్కరించారు. ఈ ప్రాంతంలో పంచాయతీ పైపులైన్ ధ్వంసంకావడంతో తాగునీరు లేక ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఈ సమస్య సర్పంచ్ బందిలి గనియమ్మ, ఉప సర్పంచ్ చింతనీడి కుమార్, కార్యదర్శి సీహెచ్ రాంబాబు దృష్టికి తీసుకెళ్లగా పైపులైన్ బాగుజేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

కొవొత్తుల ర్యాలీ

జగ్గంపేట: ఎయిడ్స్ నిర్మూలనకు కృషి చేద్దామంటూ శాస్ ప్రివేన్షన్ యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక కాకినాడ రోడ్డులో ఆదివారం కొవొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, జగ్గంపేట ఉప సర్పంచ్ బండారు రాజా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సాస్ సంస్థ పీడీ యాళ్ల పద్మలత, పీఎం బండారు శైలజ, ఎంపీటీసీలు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శిక్షణ



ఏలేశ్వరం గ్రంథాలయంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

ఏలేశ్వరం: గ్రంథాలయాల్లో వేసవి శిక్షణా శిబిరాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయ పాలకుడు కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. మండల మాస్టర్ ట్రైనర్ మజ్జి నాగేశ్వరరావు వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుడు ఎం.రాము చిత్రలేఖనంపై తరగతులు నిర్వహించారు. స్టడీ సర్కిల్ ట్రైనర్ మణికంఠ పుస్తకాల ద్వారా విజ్ఞానం పొందడంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఊరిలోనే మెరుగైన వైద్యం

- జగ్గంపేట సీహెచ్‌సీకి రూ.75లక్షల విలువైన ఆధునిక పరికరాలు
- పేదలకు మరింత చేరువైన వైద్య సేవలు

జగ్గంపేట: ఇప్పుడు వైద్యం కోసం పట్టణానికి, నగరానికి వెళ్లాల్సిన అవసరం లేదు. మన ఊరులోనే అత్యాధునిక వైద్య పరికరాలతో సేవలందిస్తున్నారు. సర్కారీ ఆసుపత్రులపై ప్రజల్లో ఉన్న అపనమ్మకాన్ని ప్రభుత్వం చెరిపేస్తోంది. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా అన్ని సదుపాయాలు కల్పిస్తోంది. ఆసుపత్రులకు అత్యాధునిక సాంకేతిక వైద్య పరికరాలు సరఫరా చేస్తోంది. ఇందులో భాగంగా జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు సుమారు రూ.75 లక్షల విలువైన ఆధునిక వైద్య పరికరాలు పంపిణీ చేసింది. వీటిలో కొన్నింటిని ఇప్పటికే వినియోగంలోకి తెచ్చారు. మిగిలినవి త్వరలోనే ఉపయోగిస్తారు. వైద్య పరికరాలు అందుబాటులో ఉండడంతో ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువకానున్నాయి. అయితే ఈ హెల్త్ సెంటర్‌పై జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ప్రత్యేక దృష్టి సారించారు. ఆయన కృషి వల్లే సీహెచ్‌సీకి రూ.75 లక్షల సాంకేతిక పరికరాలు వచ్చాయి.

30 గ్రామాల ప్రజలకు అందుబాటులో..

మండలంలోని జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు సుమారు 20 నుంచి 30 గ్రామాల ప్రజలు వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. రోజుకు 180 నుంచి 250 వరకూ పేషెంట్లు వస్తుంటారు. ఇక్కడ డాక్టర్లు, టెక్నీషియన్లు, సిబ్బంది మొత్తం 45 మంది పనిచేస్తున్నారు. ఈ ఆసుపత్రి గ్రామానికి శివారులో ఉన్నా ఇబ్బంది పడినా ఇక్కడకే వస్తుంటారు. ప్రతి నెల ఇక్కడ వివిధ రకాల ఆపరేషన్లు 30 నుంచి 50 వరకూ జరుగుతాయి. ఇన్‌పేషెంట్లు నెలకి 750 పైగా ఉంటున్నారు. అంతేకాకుండా జాతీయ రహదారిని ఆనుకుని ఉండడంతో ఎక్కడ ప్రమాదాలు జరిగినా క్షతగాత్రులను ఇక్కడికే తీసుకువస్తారు.



జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్

జగ్గంపేట ఆసుపత్రికి వచ్చిన ఆధునిక పరికరాలు

పరికరాలు	సంఖ్య	వాటి ధర
వెంటిలేటర్లు	5	రూ. 10 లక్షలు
ఎక్స్‌రే మెషీన్	1	రూ. 3 లక్షలు
బయోకెమికల్ ఎనలైజర్ చిన్నది	1	రూ. 1.5లక్షలు
బయోకెమికల్ ఎనలైజర్ పెద్దది	1	రూ. 18 లక్షలు
బ్లడ్ బ్యాంక్ రిఫ్రిజరేటర్ చిన్నది	1	రూ. 80 వేలు
బ్లడ్ బ్యాంక్ రిఫ్రిజరేటర్ పెద్దది	1	రూ.3 లక్షలు
ఎలక్ట్రిక్ బ్యాటరీ	1	రూ.1.20 లక్షలు
హెడ్ లైట్ అండ్ ఈఎన్‌టీ సెట్	1	రూ.1.50 లక్షలు
ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు	25	రూ.14 లక్షలు
జనరేటర్	1	రూ. 5 లక్షలు
టర్బైదో మీటర్	1	రూ.1.20 లక్షలు

ఇవి కాకుండా ఆటోక్లేవ్, మైక్రో స్కోప్స్, షేడ్ ల్యాంప్స్, ఆపరేషన్ టేబుల్స్, ఇంక్యుబులేటర్, హాట్ ఓవెన్, పీహెచ్ మీటర్, ఎలక్ట్రోలైట్ ఎనలైజర్, మల్టీ పేరా మీటర్స్, సెక్షన్ ఆపరేటర్, రోగులకు బెడ్స్, ఫర్నిచర్, టేబుళ్లు, డాక్టర్ చైర్లు ఇతర పరికరాలు ఆసుపత్రికి వచ్చినట్టు జగ్గంపేట కమ్యూనిట్ హెల్త్ సెంటర్ డాక్టర్ రమేష్ కుమార్ వివరించారు.



రేండేళ్ల అయినా బిగించకుండా ఉండిపోయిన ఎక్స్‌రే మిషన్



నెలలు కావస్తున్నా వినియోగానికి నోచుకోని జనరేటర్

ఆధునిక పరికరాలు వచ్చినా తప్పని తిప్పలు

జగ్గంపేట సీహెచ్‌సీకి ఎక్స్‌రే మెషీన్ వచ్చి రెండేళ్లు అవుతున్నా అమర్చలేదు. దీంతో ఆసుపత్రికి వచ్చిన రోగులు ఎక్స్‌రేకి జగ్గంపేటలో ప్రైవేట్ ఆసుపత్రులకు పంపిస్తున్నారు.

బయోకెమికల్ ఎనలైజర్ చిన్నది, పెద్దది ఉన్నా పెద్దది వినియోగంలో లేదు. దీనివల్ల ఏ రకమైన బ్లడ్ టెస్టులు కావాలన్న బయట ల్యాబ్‌లకు పంపిస్తున్నారు.

స్కానింగ్ మిషన్ ఉన్నా పనిచేయడం లేదు. దీని వల్ల గర్భిణులు ప్రైవేట్ సంస్థలకు వెళుతున్నారు.

ఈసీజీ మిషన్‌లో కొన్ని పరికరాలు (పేపర్‌రోల్స్) లేవని బయటకు పంపుతున్నారు.

జనరేటర్ చాలా పెద్దది వచ్చినా ఉపయోగించడం లేదు. కొత్తగా వచ్చిన పరికరాలు చాలా వరకూ ఏదో ఒక మూల ప్యాకింగ్‌లతోనే కనిపిస్తున్నాయి. వీటిని వినియోగంలోకి తెస్తే ఆసుపత్రికి వచ్చే పేదలకు బయటకు వెళ్లి రక్త పరీక్షలు, ఎక్స్‌రేలు, స్కానింగ్‌లు కోసం వందలాది రూపాయిలు ఖర్చుచేసే అవసరం తప్పుతుంది. పేదలకు మేలు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది.

పరికరాలు వచ్చినా..



జగ్గంపేట సీహెచ్‌సీకి ప్రభుత్వం సరఫరా చేసిన ఆధునిక సాంకేతిక పరికరాలు తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలి. దీనివల్ల ప్రజలకు ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లే దుస్థితి తప్పుతుంది. ఆసుపత్రి ఊరికి దూరంగా ఉండడంతో ప్రజలు వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. ప్రజలకు ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని పరికరాలన్నీ అందుబాటులోకి తీసుకురావాలి.

– జుత్తుగ నాగేశ్వరరావు, క్యాండిల్ యూత్ వలంటరీ ఆర్గనైజేషన్ చైర్మన్, జగ్గంపేట

వినియోగంలోకి తెస్తాం



గతంలో ఏ నాడు లేని విధంగా ఈ ప్రభుత్వం ఎన్నో ఆధునిక వైద్య పరికరాలు పంపిణీ చేసింది. వీటిని వినియోగంలోకి తేచ్చేందుకు కొన్ని సాంకేతిక ఇబ్బందులు ఉన్నాయి. పరికరాలు అమరికలు పలు సంస్థలు చేయాల్సి ఉంది. వారు అందుబాటులో లేరు. త్వరలోనే అన్ని పరికరాలు పని చేసేలా చేస్తాం. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు వీటి విషయమై పలు సూచనలు చేశారు. వాటిని అమలు చేస్తాం.

–డాక్టర్ రమేష్ కుమార్, జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్, జగ్గంపేట

మట్టి అక్రమ రవాణా



జగపతినగరంలో ఓ ఇటుక బట్టీలో మట్టిని అన్‌లోడు చేస్తున్న లారీ

కిర్లంపూడి: మట్టి అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీలకు సంబంధించిన మట్టిని ఎలాంటి అనుమతులూ లేకుండా రవాణా చేస్తున్నారు. మట్టిని రవాణా చేయాలంటే స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాతపూర్వకంగా అనుమతి తీసుకోవాల్సి ఉంది. అవేవి లేకుండా రాత్రి పగలు తేడా లేకుండా బహిరంగంగానే టిప్పర్లతో మట్టిని రవాణా చేస్తున్నారు. క్లౌడుటే మట్టి రవాణా జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని పలువురు బహిరంగానే విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి అక్రమ రవాణాదారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు వాపోతున్నారు. దీనిపై తహసీల్దార్ కె.వెంకటమాధవరావును వివరణ అడగగా మట్టి రవాణాపై మండలంలోని ఎవరికీ ఎటువంటి అనుమతులూ ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మట్టిని తరలించినట్టయితే విచారణ జరిపించి, వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



దానవాయిపేటలో గ్రావెల్ రోడ్డుకు భూమిపూజ చేసిన నాయకులు

తొండంగి: దానవాయిపేట నుంచి ఒంటిమామిడి వరకూ శివాలయం రహదారిలో రూ.40 లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి ఆదివారం భూమి పూజ జరిగింది. ఒంటిమామిడి దివీస్ ల్యాబోరేటరీస్ ఆర్థిక సహకరంగా రోడ్డు నిర్మిస్తున్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, వైఎస్సార్ సీపీ నాయకులు మేరుగు ఆనందహరి, సర్పంచ్ మడదా తిరుమల కుమారి కంపెనీ ప్రతినిధులతో కలిసి రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఒంటిమామిడి గ్రామ శివారులో శివాలయం రహదారి దీర్ఘకాలంగా అభివృద్ధికి నోచుకోలేదు. దివీస్ ల్యాబోరేటరీస్ గ్రామ అభివృద్ధికి ఆర్థిక సహకారం అందించడంతో పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో దివీస్ ల్యాబోరేటరీస్ ప్రతినిధులు వి.నాగేశ్వర్, ఆర్.సుధాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు మడదా పరమేశ్వరరావు, మడదా హేమంత్, చొక్కా భాస్కరరావు, కందాల రాము, సూరాడ గోపి తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్‌లో చాణక్య ప్రతిభ



సామర్లకోట: ఇటీవల పాలకొల్లులో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో సామర్లకోటకు చెందిన ఎస్.చాణక్య ప్రతిభ కనబర్చాడు. దీంతో జిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించినట్లు బాస్కెట్ బాల్ కోచ్ ఐ.గోపాలకృష్ణ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో గోపాలకృష్ణ విద్యార్థులకు ఉచితంగా బాస్కెట్‌బాల్ కోచింగ్ ఇస్తున్నారు. ఆయన శిక్షణతో జిల్లా జట్టులో ఎంపిక కావడంతో పాటు రాష్ట్ర స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానం సాధించానని చాణక్య తెలిపారు. విజేతను గోపాలకృష్ణ, మాజీ కౌన్సిలర్ కాళ్ల లక్ష్మీనారాయణ అభినందించారు.

పోలీసు సేవలకు గుర్తింపు



తునిలో సీఐ నాగదుర్గారావును సత్కరిస్తున్న మారుతీ డయాగ్నోస్టిక్స్ యాజమాన్యం

తుని: సమాజంలో నిస్వార్థ సేవలందించే పోలీసులను గుర్తించి, వారిని మారుతీ డయాగ్నోస్టిక్స్ సంస్థ సత్కరించడం ఎంతో సంతోషమని పట్టణ సీఐ నాగదుర్గారావు అన్నారు. ఆదివారం స్థానిక మారుతీ డయాగ్నోస్టిక్స్ ఆవరణలో ట్రాఫిక్ పోలీసులకు మెడికల్ కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ నాగదుర్గారావు మాట్లాడుతూ పోలీసు సేవలను గుర్తించి ఆదరించడంపై జిల్లా పోలీసుశాఖ తరుపున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ట్రాఫిక్ పోలీసులకు ఉష్ణతాపాన్ని తట్టుకునేందుకు ఉపయోగపడే గ్లూకోజ్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కూలింగ్ కళ్లజోళ్లు, టోపీలు, డ్రైఫ్రూట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ నాగదుర్గారావును డయాగ్నోస్టిక్స్ యాజమాన్యం శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మారుతీ డయాగ్నోస్టిక్స్ పరిపాలనాధికారి వి.సత్యనారాయణ, డాక్టర్లు, ప్రముఖులు పాల్గొన్నారు.

సైకిల్ షాప్ వర్కర్ల యూనియన్ సమావేశం

జగ్గంపేట: సైకిల్ షాప్ వర్కర్ల యూనియన్ సమావేశం స్థానిక స్టాలిన్ భవనంలో ఆదివారం జరిగింది. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు మరుకుర్తి ఏసుబాబు, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పెద్దాపురం డివిజన్ కార్యదర్శి వి.చిట్టిబాబు, కార్మిక వర్కర్స్ యూనియన్ నాయకులు ఎన్.సురేష్, రాంబాబు, దుర్గాప్రసాద్, దాదా, రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

జగ్గంపేట: కాట్రావులపల్లిలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్టు ఎస్సై సీహెచ్ విద్యాసాగర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గ్రామ శివారులో పేకాడుతున్నట్టు ముందుగా అందిన సమాచారం మేరకు తన సిబ్బందితో వెళ్లి పేకాట శిబిరంపై దాడి చేసి, ముగ్గురుని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 1600 నగదును స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించనున్నట్టు తెలిపారు.

ఘనంగా గంగాలమ్మ జాతర

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే కొండపల్లి గంగాలమ్మ జాతర మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, కళ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులందరూ అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ సర్పంచ్ కొత్త చక్రరావు, ఎంపీటీసీ సభ్యుడు పోకనాటి నాగలక్ష్మి ఆధ్వర్యంలో గ్రామపెద్దలు వారికి ఘన స్వాగతం పలికి అమ్మవారి ఉత్సవాన్ని అత్యంత వైభవంగా జరిపారు. అనంతరం గరగల ఉత్సవం, కోలాటం, బ్యాండ్ మేళాలతో అమ్మవారి ఊరేగింపు జరిగింది. అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, లక్కాకుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్‌కు నివాళి

ప్రత్తిపాడు: స్థానిక అంబేడ్కర్ కళామందిర్ జంక్షన్ వద్ద భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆపార్టీ గ్రామ కమిటీ నాయకులు దాసరి సత్తిబాబు, కందిమళ్ళ శామ్యూలు, కాళ్ళ చిన్న తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 32 వర్ధంతిని జగ్గంపేటలో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జీ మరోతి శివగణేష్ పార్టీ నేతలతో కలిసి స్థానిక అంబేడ్కర్ నగర్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాజీవ్ గాంధీ ప్రధానిగా భారతదేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

మేకల దొంగతనంపై కేసు

గోకవరం: తిరుమలాయపాలెంలో జరిగిన మేకల దొంగతనంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదయ్యింది. ఏఎస్సై శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కొట్టుకుల చంటమ్మ మేకలు పెంచుతూ జీవిస్తోంది. ఈనెల 18న రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కారులో వచ్చి ఏడు మేకలను అపహరించారు. అలాగే ఆదివారం మరో నాలుగు మేకలను కారులో వేసుకుని ఎత్తుకుపోయారు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

తుని: రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జీఆర్పీ ఎస్సై షేక్ అబ్దుల్‌మారూఫ్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తుని రైల్వేస్టేషన్ పరిధిలో ఉన్న గుల్లిపాడు–నర్సీపట్నంరోడ్డు రైల్వేస్టేషన్ల మధ్య రైలు బండి నుంచి జారీ పడి సుమారు 50ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి మృతి చెందాడు. మృతుడు తెలుపు రంగుపై నల్లని అడ్డగీతల చొక్కా, నలుపు రంగు ఫుల్‌ప్యాంటు ధరించి ఉన్నాడు. ఇతని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94906 19020, 94948 87787 నంబర్లను సంప్రదించాలన్నారు.

ప్రసాద ప్యాకర్ మృతి



సాగి చలపతి

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని దేవస్థానంలోని ప్రసాదం విభాగంలో ప్యాకర్‌గా పనిచేస్తున్న సాగి చలపతి(35) ఆదివారం మధ్యాహ్నం విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో మృతి చెందారు. ఆయన గత కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్నారని దేవస్థానం అధికారులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సాగి చలపతి మృతిపై దేవస్థానం సిబ్బంది తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

కళాకారుడి బతుకు చిత్రం



రత్నగిరిపై భక్తుడి చిత్రం గీస్తున్న పెదపాటి రాజు

- కరోనాతో తలకిందులైన జీవితం
- రత్నగిరిపై భక్తుల చిత్రాలు గీస్తూ జీవనం

అన్నవరం: కరోనా వైరస్ ఎంతో మంది జీవితాలను తలకిందులు చేసింది. ప్రైవేట్ కళాశాలలో పాఠాలు చెప్పే లెక్చరర్లు కరోనా వలన కొలువులు కోల్పోయి కూరగాయలు, పండ్లు అమ్ముకునే స్థాయికి వచ్చారు. గొప్ప గొప్ప కళాకారులు పనుల్లేక చిన్న చిన్న పనులు చేసుకుంటూ కాలం గడుపుతున్న సంగతులు విన్నాం. అటువంటిదే శంఖవరం మండలం కత్తిపూడికి చెందిన పెదపాటి రాజు కథ. రత్నగిరిపై సత్యదేవుని ఆలయానికి వచ్చిన భక్తుల చిత్రాలను గీస్తూ ఆయన కనిపించాడు. అతని గురించి అడిగితే వివరాలు తెలిపాడు..

ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

నర్సీపట్నంలో పాలిటెక్నిక్ మెకానికల్ చదివాను. చిన్నప్పటి నుంచి చిత్రలేఖనం అంటే ఇష్టం. పెన్సిల్‌తో బొమ్మలు గీస్తాను. పెయింటింగ్‌లు వేస్తాను. ఇంకా చాక్‌పీసులపై బొమ్మలు రూపొందిస్తాను. కాలితో బ్రష్ పట్టుకుని చిత్రాలు వేయడం తదితర కళలన్నీ వచ్చు. 20 ఏళ్ల క్రితం హైదరాబాద్ వెళ్లాను. అక్కడ ఎన్‌టీఆర్ గార్డెన్స్‌లో సందర్శకులవి రకరకాల చిత్రాలు గీశాను. బాగా గిట్టుబాటు అయ్యేది. ప్రముఖులు తమ చిత్రాలను గీయించుకునేవారు. మాధాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో రసరమ్య చిత్రాలు పేరుతో వేసిన చిత్రాలతో ఆర్ట్ ఎగ్జిబిషన్ కూడా నిర్వహించాను. అప్పటి కూకట్‌పల్లి ఎమ్మెల్యే, లోక్‌సత్తా అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్ ఆర్ట్ ఎగ్జిబిషన్ ప్రారంభించారు. ప్రముఖ సంఖ్యాశాస్త్రజ్ఞుడు దైవజ్ఞశర్మ ఇంకా చాలా మంది ప్రముఖులు వచ్చి ఆ ఎగ్జిబిషన్‌ను సందర్శించి నన్ను ప్రశంసించారు. 2020 మార్చిలో కరోనా కారణంగా లాక్‌డౌన్ విధించారు. అప్పుడు ఇంటికే పరిమితమయ్యాను. హైదరాబాద్‌లో ఇంటి అద్దె కట్టలేక తిండికి కూడా ఇబ్బంది పడ్డాను. నాకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారిని తీసుకొని స్వగ్రామం కత్తిపూడి వచ్చేశాను. అప్పటి నుంచి ఇళ్లకు రంగులు వేయడం వంటి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాను. ఆ పని లేకపోయినప్పుడు రత్నగిరి కొండ మీదకు వచ్చి భక్తుల చిత్రాలు గీచి ఉపాధి పొందుతున్నాను. అయితే రోజుకు ముగ్గురు, నలుగురు మాత్రమే తమ చిత్రాలు గీయించుకుకోవడంతో ఆదాయం అంతంత మాత్రమే వస్తోంది.



హైదరాబాద్‌లోని స్టేట్ ఆర్ట్‌గ్యాలరీ లో రాజు చిత్రీకరించిన చిత్రాలపై పత్రికల్లో ప్రచురితమైన వార్త